# మాట తప్పను.. సేవచేయడం మరువను



తిమ్మాజిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

- అవసరమైతే సొంతంగానే సంక్షేమం
- వ్యక్తిగతంగా దూషిస్తున్నారు..
- కంట తడిపెట్టిన ఎమెల్యే మర్రి

తిమ్మాజిపేట, నవంబర్ 28 : మాట ఇస్తే తప్పను.. మీకు సేవ చేయడానికి రాజకీయాలకు వచ్చిన, పదవీ, డబ్బుపై వ్యామోహం లేదు.. నాగర్‌కర్నూల్ ప్రాంతంలో ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కోసం అవసరమైతే సొంత డబ్బును వెచ్చిస్తానంటూ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారం చివరిరోజు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. తిమ్మాజిపేట మండలం తన గుండెకాయని, మండలానికి ఎంతో చేశానని, మరింత చేయాల్సి ఉందన్నారు. ఈ సారి ఆశీర్వదిస్తే మండలంలో 200 ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని, యువతీ, యువకులకు ఉపాధి కల్పిస్తానన్నారు. తాను గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చానన్నారు. ఇండ్లు లేని పేదలు చాలా మంది ఉన్నారని, వారి కోసం ఇండ్లు నిర్మిస్తామన్నారు. అవసరమైతే రెండేండ్లు సామూహిక వివాహాలు వాయిదా వేసి, ఆ డబ్బులో అర్హులకు ఇండ్లు కట్టిస్తామన్నారు. మండలం ఆనుకుని వట్టెం, కర్వెన ప్రాజెక్టులున్నాయని, వాటి నిర్మాణం 95 శాతం పూర్తయ్యిందని, అతి త్వరలో మండలానికి సాగునీరు అందిస్తామన్నారు. ఇటీవల ప్రతిపక్ష నాయకులు తనను, తన కుటుంబాన్ని వ్యక్తిగతంగా దూషిస్తున్నారని మర్రి భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి మర్రిజమున, నాగం శశిధర్‌రెడ్డి, ఎంపీపీ రవీంద్రనా థ్‌రెడ్డి, జెడ్పీటీసీ దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

**కందనులుకు దీటుగా అభివృద్ధి**

బిజినేపల్లి, నవంబర్ 28 : నియోజకవర్గంలో బిజినేపల్లిని నాగర్‌కర్నూల్ కు దీటుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో త్వరలోనే పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. రాబోవు రోజుల్లో బిజినపల్లి నియోజకవర్గంగా ఏర్పడబోతుందన్నారు. ఇక్కడ రాబోవు రోజుల్లో డిగ్రీ కళాశాల, పరిశ్రమలు, డివైడర్ సెంటర్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులను చేయడం జరుగుతుందన్నారు. ఎట్లైతే మార్కండేయ రిజర్వాయర్ను హామీ ఇచ్చిన మేరకు అనుకున్న సమయంలో పూర్తి చేశాను. కార్యక్రమంలో మర్రి జమున, డీసీసీబీ డైరెక్టర్ జక్క రఘునందన్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కుర్మయ్య, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

**రైతుల అభివృద్ధే ధ్యేయం**

తాడూరు, నవంబర్ 28 : రైతుల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మర్రి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. మహిళలు బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, వైస్‌ఎంపీపీ శివలీల, మండలాధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి**

తెలకపల్లి, నవంబర్ 28 : ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చారని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సతీమణి మర్రిజమున అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం ముగింపు సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే సొంత పథకాలతో ఎంజేఆర్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు అందించినట్లు చెప్పారు. అంతకముందు జమిస్తాపూర్ నుంచి చిన్నముద్దునూరు, రాంరెడ్డిపల్లి మీదుగా తెలకపల్లి వరకు బైక్ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే తనయుడు మర్రి శశిధర్ రెడ్డిని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బైకని శ్రీనివాస్ యాదవ్, గ్రంథాలయ జిల్లా చైర్మన్ హన్మంతరావు, ఎంపీపీ మధు, మండల పార్టీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి మర్రి జమున



బిజినేపల్లి రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, నవంబర్ 28 : జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ కొనసాగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎన్‌ఐసీ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి మాట్లాడారు. ఎన్నికల ప్రచారం మంగళవాం సాయంత్రం 5 గంటలకు ముగిసిందని, ఆ తరవాత అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎక్కడ కూడా ఏ విధమైన ప్రచారం కూడా నిర్వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. 30వ తేదీన ఉదయం 5 గంటల్లోగా ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని ఆయన స్పష్టం చేశారు. 48 గంటల ముందు ఓపీనియన్ పోల్స్ , డిబేట్ , ఇంటర్వ్యూలు, అనాలసిస్ వంటివి నిర్వహిస్తే నిబంధనల ఉల్లంఘనల కిందకు వస్తుందని తెలిపారు. 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. ఎంసీసీ ఉల్లంఘనలు, మద్యం, డబ్బులు పంపిణీకి సంబంధించిన ఫిర్యాదులు ఉంటే కాల్ సెంటర్ 1950, సీ విజిల్ లో నమోదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తమకు పోస్టల్ బ్యాలెట్ రాలేదని కంగారు పడాల్సిన అవసరం లేదని, ఏవైనా సందేహాలు ఉంటే రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. 3 నియోజకవర్గాలలో 7 లక్షల 90 వేల 76 మంది ఓటర్లు ఉన్నారు.అందులో పురుష ఓటర్లు 3,57226 మంది, మహిళా ఓటర్లు35,1838 మంది ఓటర్లు. 9139 సీనియర్ సిటిజన్ ఓట్లు ఉన్నారని,5138 మంది దివ్యాంగ ఓటర్లు జిల్లాలో ఉన్నట్లు తెలిపారు. ఓటర్లకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామన్నారు.

## ఎన్నికల భద్రతకోసం కేంద్ర, రాష్ట్ర బలగాలు

- సలహాలు, సూచనలు అందించిన ఎస్పీ

నాగర్‌కర్నూల్, నవంబర్ 28 : ఎన్నికల భద్రత పకడ్బందీగా ఉండాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. మంగళవారం ఎన్నికల బందోబస్తుకు వచ్చిన కేంద్ర, రాష్ట్ర బలగాలకు ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లాలో అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించేలా 2,710 మంది బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి 850 మంది హోంగార్డులు, ఆంధ్రప్రదేశ్ నుంచి 10 మంది కానిస్టేబుళ్లు, 10 మంది హోంగార్డ్స్, ఇండో టిబెటన్ బోర్డర్ నుంచి 180 మంది, ఉత్తర ప్రదేశ్ నుంచి 904 మంది, సీఐడీ నుంచి 13 మంది ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ నుంచి ఒక డీఎస్పీ, తెలంగాణ పోలీస్ అకాడెమీ నుంచి అదనపు ఎస్పీ, తెలంగాణ స్పెషల్ పార్టీ నుంచి 42 మంది, జిల్లాకు చెందిన 646 మందితో మొత్తం 2710 మందిని ఎన్నికల విధుల్లో వాడుకుంటున్నారని తెలిపారు. అలాగే ఎన్నికల విధుల్లో ఏ విధంగా డ్యూటీలు చేయాలి, ఏ విధమైన భద్రత కల్పించాలి అనే వాటిపై నిర్దేశాలు చేశారు.

# ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పరిశీలకుడు మిథిలేశ్‌మిశ్రా
- జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, నవంబర్ 28 : ఎన్నికల నిర్వహణలో రాబోయే 48 గంటలు అత్యంత కీలకమని ఎన్నికల పరిశీలకుడు మిథిలేశ్‌మిశ్రా అన్నారు. ప్రత్యేక పరిశీలన బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యయ పరిశీలకుడు బేరారాం చౌదరి, సాధారణ పరిశీలకుడు సతీశ్‌కుమార్, పోలీస్ అబ్జర్వర్ ఇస్మాయిల్, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైకాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి నోడల్ అధికారులతో కలెక్టరేట్లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచార కార్యక్రమాలు నిలిచిపోతాయని ఆయన తెలిపారు. ఎన్నికల అధికారులు ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియకు ఎన్నికల విభాగం అధికారుల కీలక పనులు మొదలవుతాయని వివరించారు. 144 సెక్షన్ అమల్లోకి వస్తుందన్నారు. పార్టీల ప్రచారాలను నిలిపివేయాలన్నారు. 29, 30 తేదీల్లో దినపత్రికలు, టీవీ ఛానళ్లలో ఇచ్చే తర్వాత ఎన్నికల విభాగం అధికారుల కీలక పనులు మొదలవుతాయని వివరించారు. సోషల్ మీడియాలో ప్రకటనలు, బల్క్ మెసేజ్లు పంపకూడదన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై 'సీ విజిల్ యాప్ ద్వారా కానీ, కలెక్టరేట్లోని ప్రత్యేక కంట్రోల్ రూం నంబరు 1950కి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిథిలేశ్ మిశ్రా

**సిబ్బంది కేటాయింపు పూర్తి**

నాగర్‌కర్నూల్, నవంబర్ 28 : జిల్లాలో పోలింగ్ సిబ్బంది 3వ విడుత ర్యాండమైజేషన్ పూర్తయినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకుడు మిథిలేశ్‌మిశ్రా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్‌లు తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ ఎన్‌ఐసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మిథిలేశ్‌మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 802 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3208 మందిని నేరుగా పోలింగ్ కేంద్రాలకు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 802 మంది పీవోలు, 802 మంది ఏపీవోలు, 1,604 మంది ఓపీవో లు ఉన్నారన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు సతీశ్‌కుమార్, అదనపు కలెక్టర్ సీతారామారావు, ఏవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

**PLOT FOR SALE**

★ EMI Plots in Jadcherla, MUDA Approved Layout గజం: రూ. 8,000/-లకే, 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌కి అతి చేరువలో, నెలసరి వాయిదా పద్ధతిలో, రూ. 10,000/-కే ప్లాట్లు పొందవచ్చు. స్పాట్ రిజి॥. 7780483434.
NT-314453

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794